దేశాన్ని ఒక్కటిగా ఉంచేది బీజేపీనే

- సమాజాన్ని విభజించేది బీఆర్ఎస్, కాంగ్రెస్
- నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి
- నగరంలో ధన్‌పాల్‌కు మద్దతుగా ప్రచారం


స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న అర్వింద్


సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు, నగరవాసులు

సుభాష్‌నగర్: దేశాన్ని ఒక్కటిగా ఉంచేది బీజేపీ మాత్రమేనని, ఆ పార్టీకి అందరూ సమానమేనని ఎంపీ అర్వింద్ ధర్మపురి పేర్కొన్నారు. నగరంలోని ఆర్ఆర్ చౌరస్తాలో ఆదివారం సాయంత్రం బీజేపీ అర్బన్ అభ్యర్థి ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా ఎన్నికల ప్రచారం సందర్భంగా ఏర్పాటుచేసిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సూరన్న రామ భక్తుడని, రామరాజ్యం ఇక్కడి నుంచే మొదలవుతుందని తెలిపారు. ధన్‌పాల్ అంత మంచి అభ్యర్థి మరొకరు దొరకరన్నారు. బీజేపీ ఏనాడూ సమాజం, కులాలు, మతాల మధ్య వివక్ష చూయించలేదని తెలిపారు. దళితబంధును బీజేపీ స్వాగతిస్తుందని, రెండేళ్లలో ఒకశాతం కూడా ఇవ్వలేదన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ గెలిస్తే పీఎఫ్ఐ, దొంగ పాస్‌పోర్టులు, దొంగ నోట్లకు అడ్డాగా మారుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. బీసీ, మైనార్టీ డిక్లరేషన్ల పేరుతో కాంగ్రెస్, బీసీ, మైనారిటీ బంధు రూ.లక్ష, దళితబంధు రూ.10లక్షల పేరుతో బీఆర్ఎస్ సమాజాన్ని విభజిస్తున్నాయన్నారు.

కేసీఆర్‌ను గెలిపించేందుకే రేవంత్ పోటీ..

కామారెడ్డిలో సీఎం కేసీఆర్‌ను గెలిపించేందుకే రేవంత్‌రెడ్డి పోటీ చేస్తున్నాడని అర్వింద్ ఆరోపించారు. కేసీఆర్ రాగానే షబ్బీర్ భయపడ్డాడని, అందుకే నిజామాబాద్ అర్బన్‌కు పారిపోయి వచ్చాడన్నారు. కేసీఆర్‌ను రెండు చోట్ల ఓడించేది బీజేపీ అభ్యర్థులేనన్నారు. కేసీఆర్ చెప్పిన 30 మందికి రేవంత్ టికెట్లు ఇచ్చాడని, 30 టికెట్లు అమ్ముకున్నాడని ఆరోపించారు. డిసెంబర్ 3న వెలువడే ఫలితాల్లో కాంగ్రెస్‌కు 60 సీట్లు వచ్చినా అభ్యర్థులను తాము ఒక దగ్గర ఉండనీయమన్నారు. ఏం చేసైనా పక్కాగా బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తోందని ధీమా వ్యక్తంచేశారు. అర్బన్ అభ్యర్థి ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా, పార్టీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య, నాయకులు, కార్పొరేటర్లు న్యాలం రాజు, స్రవంతిరెడ్డి, పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, నాగోళ్ల లక్ష్మీనారాయణ, ప్రవళిక, బంటు వైష్ణవి, తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణులకు అండగా ఉంటాం


మినీ ట్యాంక్‌బండ్ వద్ద సందర్శకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా

నిజామాబాద్ నాగారం: బ్రాహ్మణులకు అండగా ఉంటామని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి బిగాల గణేశ్‌గుప్తా పేర్కొన్నారు. నగరంలో ఆదివారం బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని, మాట్లాడారు. నాగారంలో ఉన్న పూజారి కాలనీని అభివృద్ధి చేశామని తెలిపారు. నగరంలో బ్రాహ్మణ భవనం, వేద పాఠశాల నిర్మించాలని బ్రాహ్మణ సోదరులు అడిగారని, ఎన్నికలు పూర్తయ్యాక సమస్యను పరిష్కరిస్తామన్నారు. మరోసారి తనను ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. మాజీ కార్పొరేటర్ కొండపాక జ్యోతి, లక్ష్మీ నారాయణ భరద్వాజ్, కొండపాక రాజేష్ పాల్గొన్నారు.

ట్యాంక్‌బండ్ సందర్శన..

నగరంలోని ట్యాంక్‌బండ్‌ను ఆదివారం ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా సందర్శించారు. ఈసందర్భంగా ఆయన స్థానిక ప్రజలతో ముచ్చటించారు. అలాగే ఎమ్మెల్యేతో పలువురు యువకులు, ప్రజలు సెల్ఫీలు తీసుకున్నారు.


బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఎమ్మెల్యే బిగాల, సంఘం ప్రతినిధులు

క్లుప్తంగా

'రాజ్యాంగ ప్రవేశిక ప్రతిజ్ఞ'



ఖలీల్‌వాడి: నగరంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఆదివారం నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ శింగెనవార్ ఆదేశానుసారం డీపీపీ జయ్‌రామ్ 'భారత రాజ్యాంగ ప్రవేశిక' కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫోటోకు పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం డీసీపీ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. సీఐ శ్రీశైలం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాజిరెడ్డికి మద్దతుగా తీర్మానం



మోపాల్(నిజామాబాద్‌రూరల్): నగరశివారులోని బోర్గాం(పి) కుర్మ సంఘం, శ్రీసాయిలక్ష్మీనగర్ కాలనీ సంఘాలు ఆదివారం నిజామాబాద్ రూరల్ బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతు పలికాయి. నుడా చైర్మన్ ఈగ సంజీవ్‌రెడ్డి ఆధ్వర్యంలో బాజిరెడ్డికి మద్దతు ప్రకటించినట్లు బీఆర్ఎస్ అధ్యక్షుడు ఈగ నర్సారెడ్డి తెలిపారు. అనంతరం నుడా చైర్మన్ సంజీవ్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం అన్నివర్గాలకు సంక్షేమ పథకాలు అందించిందని, వారందరూ బీఆర్ఎస్‌కు అండగా ఉన్నారని తెలిపారు. సొసైటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, కుర్మ సంఘం అధ్యక్షుడు దాహిని గంగారాం, శ్యామ్‌రావు, గంగాధర్, పెంటయ్య, సాయిలక్ష్మీనగర్ కాలనీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, పల్లె శ్రీనివాస్, బంటు దాస్, వినోద్, కిషన్, దేవేందర్, విఠల్, కామర్స్ నడ్పి గంగారాం, బెండు భూమయ్య, మహేష్, కుల సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను మోసం చేసిన బీఆర్ఎస్



నిజామాబాద్ రూరల్: ముదిరాజ్‌లను బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసిందని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర యూత్ కార్యదర్శి ఈర్ల శేఖర్ ఆరోపించారు. నగరంలోని 44 డివిజన్ ముదిరాజ్ గల్లీలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపిస్తే, ముదిరాజ్ కులస్తులను అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. ముదిరాజ్‌లకు ప్రత్యేకమైన కార్పొరేషన్ ఏర్పాటు చేసి బిసి (డి) నుంచి బిసి (సి) మారుస్తామని హామీ ఇచ్చారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలు ముదిరాజ్ సామాజిక వర్గానికి అమలయ్యేవిధంగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. నాయకులు శేఖర్, వినోద్, రాములు పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగకు భగవద్గీత అందజేత



సుభాష్‌నగర్: ఎన్నికల ప్రచారం నిమిత్తం నగరానికి విచ్చేసిన ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగకు ఆదివారం మంచాల శంకరయ్య గుప్తా ట్రస్ట్ చైర్మన్ మంచాల జ్ఞానేందర్ భగవద్గీతను అందజేశారు. ఈసందర్భంగా భగవద్గీత పంపిణీ ఉద్దేశాన్ని మందకృష్ణ మాదిగకు వివరించారు. అనంతరం మంచాల జ్ఞానేందర్‌ను ఆయన అభినందించారు.

వీర జవాన్‌కు ఘననివాళి

బాల్కొండ: 75వ ఎన్‌సీసీ డేను పురస్కరించుకొని బాల్కొండ మండ లం చిట్టాపూర్ వద్ద వీర జవాన్ ఎర్రం నర్సయ్య విగ్రహానికి ఆదివారం పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. తెలంగాణ 12వ ఎన్‌సీసీ బెటాలియన్ సూచన మేరకు జవాన్ నర్సయ్య విగ్రహానికి నివాళులర్పించినట్లు ఎన్‌సీసీ అధికారి వెంకటేశ్ తెలిపారు. కార్యక్రమలో సుబేదార్ మేజర్ కర్నయ్య, హవాల్దార్లు జయరాం, జహంగీర్, సర్పంచ్ వనజ పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు



బోధన్: బకాయి వేతనాలు చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఎన్డీఎస్ఎల్ కార్మికులు చేపట్టిన రిలే దీక్షలు కొనసాగుతున్నాయి. ఆదివారం నాటికి రిలే దీక్షలు 114వ రోజుకు చేరాయి. కార్మిక నాయకుడు నాగేశ్వర్‌రావు, లింగం గౌడ్, రఘునాథ్, అన్వర్‌మియా, నయీమొద్దీన్, మోహినొద్దీన్, వికారుద్దీన్ పాల్గొన్నారు.

మళ్లీ ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేస్తా

- నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్
- పలు గ్రామాల్లో జోరుగా ఎన్నికల ప్రచారం


బాజిరెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న నాయకులు


సారంగాపూర్ గ్రామంలో మాట్లాడుతున్న బాజిరెడ్డి

నిజామాబాద్ రూరల్/మోపాల్: నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యేగా తనను మళ్లీ ఆశీర్వదిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని రూరల్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ ప్రజలకు హామీ ఇచ్చారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు చేస్తున్న అబద్ధాలు, వాగ్దానాలను నమ్మితే మోసపోయి గోస పడతామన్నారు. రూరల్ మండలంలోని రాంనగర్, సారంగాపూర్, ముబారక్ నగర్, గూపన్పల్లి ,గంగస్థాన్, మాధనగర్ గ్రామాలతో పాటు మోపాల్ మండలంలోని న్యాల్‌కల్, సిర్‌పూర్, ముదక్ పల్లి, శ్రీరాంనగర్ తండా, బోర్గం గ్రామాల్లో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అభివృద్ధిలో నంబర్ వన్‌గా నిలిచిందని గుర్తుచేశారు. హైదరాబాద్ వంటి మహా నగరాల్లో ఐటీ కంపెనీలు కేటీఆర్ సమక్షంలో వస్తున్నాయని హైదరాబాద్ ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ఇటీవల పోలీస్ కానిస్టేబుల్ నియామకానికి ప్రత్యేక కోర్సును తన సొంత డబ్బులతో ఇప్పించారని, ఈ అవకాశంతో దాదాపు 60 మంది పోలీసు అధికారులుగా మారారని అన్నారు. రేవంత్‌రెడ్డి ఒక డమ్మీ క్యాండిడేట్ అని, అతడిని చూసి ఓట్లు పడవని ఎద్దేవా చేశారు. నిన్న మొన్న వచ్చిన మాండవ వెంకటేశ్వరరావుతో ఒరిగేదేమీ లేదని ఏమీ లేదన్నారు. బాజిరెడ్డి సతీమణి వినోదమ్మ, మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్, ఒలింపిక్ జిల్లా అధ్యక్షుడు ఈగ సంజీవరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్లు చంద్రశేఖర్‌రెడ్డి, లింగం, ముత్యం రెడ్డి, శ్రీనివాస్‌రావు, ఉమాపతిరావు, శ్రీనివాస్, కన్నిరాం నరేష్, జెడ్పీటీసీ సుమలత గోపాల్ రెడ్డి, ఎంపీపీ అనూష ప్రేమదాస్ నాయక్, సింగిల్ విండో చైర్మన్ దాసరి శ్రీధర్, గుండారం ఎంపీటీసీ అంకాల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల విస్తృత ప్రచారం




మునిపల్లిలో ప్రచారం చేస్తున్న అజయ్.. పడకల్‌లో బాజిరెడ్డికి మద్దతు ప్రకటిస్తున్న మాల సంఘ సభ్యులు

జక్రాన్‌పల్లి: మండలంలోని మునిపల్లిలో ఆదివారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ తనయుడు బాజిరెడ్డి అజయ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి, తన తండ్రి బాజిరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. అలాగే బ్రాహ్మణ్‌పల్లిలో జెడ్పీటీసీ తనుజారెడ్డి, సికింద్రాపూర్‌లో ఎంపీపీ విమల, పడకల్‌లో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు పుప్పాల శ్రీనివాస్, పార్టీ అధ్యక్షుడు నట్ట బోజన్న ప్రచారం చేపట్టారు. నాయకులు కుంచాల రాజు, పాట్కురి శ్రీనివాస్‌రెడ్డి, మైదం రాజన్న, పుప్పాల శ్రీనివాస్,గడ్డం గంగారెడ్డి, బాలకిషన్, జైపాల్‌రెడ్డి, పోతే రాజు, దేవరాజ్, రాజేశ్వర్ ఉన్నారు.

బాజిరెడ్డికి మద్దతుగా తీర్మానం..

మండలంలోని పడకల్‌లో ఎమ్మెల్యే బాజిరెడ్డికి ఎస్సీ మాల సంఘ సభ్యులు ఏకగ్రీవంగా మద్దతు ప్రకటించారు. తామంత బీఆర్ఎస్‌కు ఓటు వేసి ఎమ్మెల్యే గెలుపునకు కృషి చేస్తామని ప్రకటించారు. గ్రామ ఉప సర్పంచ్ రిత్విక్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకుడు విజయ్‌కు తీర్మాన పత్రాన్ని అందజేశారు.సంఘ పెద్దలు బక్కన్న, గంగాధర్, అశోక్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.


నగరంలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ గ్లోబల్ కోఆర్డినేటర్ బిగాల మహేష్

ఖలీల్‌వాడి: నగరంలోని 34వ డివిజన్ మిర్చి కాంపౌండ్‌లో ఆదివారం బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ గ్లోబల్ కోఆర్డినేటర్ బిగాల మహేష్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నగరంలో అభివృద్ధి సంక్షేమాన్ని చూసి బీఆర్ఎస్‌ను గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని తెలిపారు. కార్పొరేటర్ బురుగుపల్లి కల్పన మల్లేష్ గుప్తా, నాయకులు జుగల్ కిషోర్ పాండే, ఎట్టం మహేష్, గోపు అనిల్, ఎగిశాల నర్సింలు, అరుణ్, ఆకుల శ్రీశైలం పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ అర్బన్ అభ్యర్థి షబ్బీర్‌అలీ


మాలసంఘ ప్రతినిధులతో కాంగ్రెస్ అభ్యర్థి షబ్బీర్‌అలీ, కాంగ్రెస్ నేతలు

- నిజామాబాద్ అర్బన్ కాంగ్రెస్ అభ్యర్థి షబ్బీర్ అలీ

ఖలీల్‌వాడి: పేదల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యమని, పార్టీ అధికారంలోకి వస్తే ప్రతి పైసా పేదల సంక్షేమం కోసం ఖర్చు పెడుతుందని అర్బన్ కాంగ్రెస్ అభ్యర్థి షబ్బీర్‌అలీ అన్నారు. నగరంలోని మున్నూరుకాపు కల్యాణ మండపంలో ఆదివారం మాల సంఘం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో షబ్బీర్‌అలీ పాల్గొని వారి మద్దతు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం తెలంగాణ ఎన్నికల్లో మాదిగ ఓటు బ్యాంకును రాబట్టుకోవడం కోసం బీజేపీ, పీఎం మోదీ ఎన్ని కుట్రలు చేసినా దళితులు కాంగ్రెస్ వెంటే ఉంటారన్నారు. మాలల్లో ఐక్యత రావాలని, చదువుతోనే గుర్తింపు వస్తుందన్నారు. నిజానికి మాల ఉపకులాలు అన్ని రంగాల్లో వెనుకబడే ఉన్నాయన్నారు. అంబేడ్కర్ అంటరాని జాతులన్నీ ఐక్యతతో ఉండాలన్నారని, ఎస్సీలలో కులాలు విచ్చిన్నం కాకూడదని అన్నారు. దళిత జాతి రాజకీయ అధికారంలోకి రాకుండా పూర్తిగా బానిసలుగా ఉంచాలని మనువాదులు అనుకుంటున్నారని తెలిపారు. దళితుల జీవితాల్లో వెలుగులు తెచ్చింది ఇందిరాగాంధీ అన్నారు. బీఆర్ఎస్ పాలనలో ఎమ్మెల్యే బంధువులకే అన్ని పథకాలు ఉంటాయని తెలిపారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలు అమలైతే పేద కుటుంబాలకు మేలు చేకూరుతుందన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు.

కోజా కమ్యూనిటీ నేతలతో సమావేశం..

నగరంలోని కోజా కాలనీలో ఆదివారం కోజా కమ్యూనిటీ నాయకులతో షబ్బీర్ అలీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎన్నికల్లో వారి మద్దతును కోరారు. ఈసందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. కోజా లేదా ఖువాజా ప్రధానంగా నిజారీ ఇస్మాయిలీ షియా సమాజమన్నారు. కోజా అనే పదం పర్షియన్ పదం ఖ్వాజా నుంచి ఉద్భవించిందని తెలిపారు. అర్బన్‌లో కాంగ్రెస్ గెలిచిన తర్వాత మిమ్మల్ని కలుపుకొని పట్టణాభివృద్ధిలో, సమాజ సేవలో ముందు వరుసలో ఉంటానని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపినందుకు ధన్యవాదాలు తెలిపారు.

వసతి గృహం వితరణ

నిజామాబాద్ సిటీ: ఇందూరు అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప స్వాముల సేవ నిమిత్తం ఆదివారం అయ్యప్ప స్వాముల వసతి గృహాన్ని గురుస్వామి గున్నాల కిషన్ గౌడ్ వితరణ చేశారు. కిషన్ గౌడ్ తల్లి గున్నాల సుగుణమ్మ జ్ఞాపకార్థం రూ. 28 లక్షలతో నిర్మించిన గదిని ఆలయానికి ఆయన అందించారు. గున్నాల గీతారాణి తదితరులు పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	62,400	వెండి (కిలో)	78,500
22 క్యారెట్స్	57,535	- నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సడ్	180
		లైవ్	160
స్కిన్‌లెస్	240	మటన్	750

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	28	50	గాజరుగడ్డ	40	60
బెండకాయ	30	50	పచ్చిమిర్చి	30	50
జీరకాయ	40	60	దోసకాయ	20	40
దొండకాయ	15	30	ఆలుగడ్డ	16	30
జీర్నిసుకాయ	50	70	గోబిగడ్డ	20	40
కాకరకాయ	30	60	గోబిపువ్వు	30	50
వంకాయ	10	20	బీట్‌రూట్	30	60
పాలకూర	10	20	కరివేపాకు	60	80
మెంతికూర	20	40	చామగడ్డ	40	60
కొత్తిమీర	20	40	గోరుచిక్కుడు	40	60
పుదీనా	50	70	చిక్కుడుకాయ	20	40
క్యాప్సికం	40	60			

- సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-2	ఆదికేశవ(తెలుగు)-10.40,1.35 7.25,10.30; సౌండ్ పార్టీ(తెలుగు)-4.30
స్క్రీన్-3	కోటా బొమ్మాళి పీఎస్(తెలుగు)-10.35, 4.25,7.40,10.25; మంగళవారం(తెలుగు)-1.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	కోటా బొమ్మాళి పీఎస్(తెలుగు)-10.30; కీడా కోలా(తెలుగు)-1.30; ఆదికేశవ(తెలుగు)- 4.10,10.25; టైగర్-3(హిందీ)-7.00
స్క్రీన్-2	కోటా బొమ్మాళి పీఎస్(తెలుగు)-10.00, 1.00,7.10,10.10; మంగళవారం(తెలుగు)-4.00
స్క్రీన్-3	టైగర్-3(హిందీ)-12.25,3.50; పర్‌ఫ్యూమ్(తెలుగు)-7.15; మంగళవారం(తెలుగు)-10.10
స్క్రీన్-4	సౌండ్ పార్టీ(తెలుగు)-1.45; మాధవే మధుసూదనా(తెలుగు)-4.30; నెపోలియన్(ఇంగ్లీష్)-9.50
దేవి	ఆదికేశవ(తెలుగు)
నటరాజ్	కోట బొమ్మాళి పీఎస్(తెలుగు)
లలితామహల్	భగవంత్ కేసరి(తెలుగు)
విజయ్	మంగళవారం(తెలుగు)

కాంగ్రెస్ వస్తేనే పేదలకు మంచి రోజులు


గడ్కోల్‌లో భూపతిరెడ్డికి బోనాలతో స్వాగతం పలుకుతున్న మహిళలు


ధర్పల్లిలో పలువురు నాయకులను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న భూపతిరెడ్డి

సిరికొండ/ధర్పల్లి: రాష్ట్రంలో బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధి ఏమి లేదని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే పేదలకు మంచి రోజులు వస్తాయని రూరల్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి భూపతిరెడ్డి అన్నారు. సిరికొండ మండలంలోని ముషీర్‌నగర్, గడ్కోల్, కొండాపూర్, తూంపల్లి, ధర్పల్లి మండలంలోని మద్దుల్ తండా, వాడి, హొన్నాజీపేట్, గుడితండా తదితర గ్రామాల్లో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో మహిళలు బోనాలు, మంగళ హారతులతో భూపతిరెడ్డికి ఘనంగా స్వాగతం పలికారు. ప్రచారంలో ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే సిరికొండ మండలానికి చెందిన వాడని రెండు సార్లు గెలిపిస్తే మండలాన్ని గాలికి వదిలేశాడని విమర్శించారు. రెండోసారి గెలవగానే రెండు సంవత్సరాల్లోపు సాగు నీరు తేకపోతే రాజీనామా చేస్తా అని చెప్పి నీళ్లు తేలేదని, రాజీనామా చేయలేదని ఆరోపించారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే మండలాన్ని జిల్లాలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతానని భూపతిరెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో చేతు గుర్తుకు ఓటు వేసి తనను దీవించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నాయకులు నగేష్‌రెడ్డి, గడీల రాములు, బాల నర్సయ్య, భాస్కర్‌రెడ్డి, రవి, బద్దం రామచందర్, ఎర్రన్న, ఆర్మూర్ బాలరాజ్, నర్సయ్య, భగవాన్‌రెడ్డి, సుభాష్, సంతోష్‌నాయక్, నరేష్, భూపతి, సంతోష్‌రెడ్డి, కిరణ్, సాగర్‌రెడ్డి ఉన్నారు.

ధర్పల్లి/ఇందల్వాయి: ధర్పల్లి మండలంలోని పలు గ్రామాలకు చెందిన బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి రూరల్ కాంగ్రెస్ అభ్యర్థి భూపతిరెడ్డి పార్టీ కండువాలు కప్పి, కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. అలాగే ఇందల్వాయి మండలం వెంగల్‌పాడ్ గ్రామానికి చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరారు.

నేడు శివాలయంలో ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై ఉన్న శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయకమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకీసేవ ఉంటుందన్నారు.

వైభవంగా కార్తీక దీపోత్సవం


బోధన్‌లోని శ్రీ చక్రేశ్వరాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

బోధన్‌రూరల్/ఆర్మూర్ టౌన్ : కార్తీక పౌర్ణమిని భక్తులు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాలు, ఇళ్లలో కార్తీకదీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. బోధన్‌లోని శ్రీచక్రేశ్వరాలయంలో కార్తీక పౌర్ణమి వేడుకలు, కార్తీక దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వందలాది మంది భక్తులు ఆలయ పరిసరాల్లో దీపాలు వెలిగించారు. ఆర్మూర్ పట్టణంలోని చిన్నాబజార్‌లో ఉన్న శ్రీలక్ష్మీనారాయణ మందిరంలో క్షత్రీయ సమాజ్ ఆధ్వర్యంలో కార్తీకపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.